ప్రజాశక్తి

సోమవారం 3 జూన్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

లెక్క తేలేది రేపే!



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లు

- **ఓట్ల లెక్కింపునకు గుంటూరు, నరసరావుపేటలో ఏర్పాట్లు**
- **అన్ని ప్రాంతాల నుంచి నేడు గుంటూరు చేరనున్న ఏజెంట్లు**
- **వ్యక్తిగత శిక్షణ, విందు ఏర్పాట్లలో అభ్యర్థుల తలమునకలు**

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. జిల్లాలోని అభ్యర్థులంతా ఏజెంట్లను సోమవారం గుంటూరు, నరసరావుపేటకు రప్పిస్తున్నారు. వీరికి కొంతసేపు శిక్షణిచ్చి తరువాత విందు ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రికి గుంటూరు, నరసరావుపేటలో బస ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఉదయం 6 గంటల కల్లా లెక్కింపు కేంద్రాలకు వెళ్లేలా అభ్యర్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని నెలలుగా పడిన 'శ్రమ'కు ఫలితం 24 గంటల్లో వెల్లడికానుండటంతో గెలుపుపై ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ పెరిగిపోతోంది.

గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం కాకాని గ్రామం వద్ద జెఎన్‌టియు కళాశాలలో మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు కూడా ప్రత్యేకంగా టేబుళ్ల ఏర్పాటు చేశారు. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో స్థాయిలో సర్వీసు ఓట్లు, పోస్టల్ బ్యాలెట్లు 25 వేల వరకూ ఉండటం వల్ల 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. నరసరావుపేటలో కూడా ఇదే రీతిలో పోస్టల్ బ్యాలెట్లు, సర్వీసు ఓట్లు 20 వేలకుపైగా ఉండటంతో 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నారు.

ఈసారి లెక్కింపు ఏజెంట్లకు ఎటువంటి ఆంక్షలు లేవు. నేరచరిత్రా ఉన్నా ఎటువంటి పరిశీలనా లేకుండా అనుమతించడం వల్ల ఘర్షణలు జరిగే అవకాశాలు లేకపోలేదు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, నరసరావుపేట జెఎన్‌టియులో ఏర్పాట్లను పల్నాడు కలెక్టర్ శ్రీకేష్ లత్కర్ ఆదివారం పరిశీలించారు. లెక్కింపు కేంద్రాల్లో బందోబస్తుకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లును పూర్తిచేశారు. ప్రత్యేక పోలీసు బలగాలను లెక్కింపు కేంద్రాల వద్ద మొహరించనున్నారు. మెటల్ డిటెక్టర్ ద్వారా తనిఖీ చేసిన అనంతరమే ఏజెంట్లు, సిబ్బంది, అభ్యర్థులను

▶ 2లో

నేటి రాత్రి నుంచి ట్రాఫిక్ మళ్లింపు

ప్రకటించిన గుంటూరు, పల్నాడు జిల్లాల ఎస్పీలు



గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గుంటూరు జిల్లాలో ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా గుంటూరు నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను మళ్లిస్తున్నట్టు జిల్లా ఎస్‌పి తుషార్ దూడి తెలిపారు. సోమవారం రాత్రి 10 గంటల నుంచి మంగళవారం రాత్రి వరకు ఈ మార్పులు ఉంటాయన్నారు. గుంటూరు నుండి విజయవాడ వైపు వెళ్లే భారీ, మధ్యతరహా రవాణా వాహనముల రాకపోకలు మళ్లింపులు బుడంపాడు జంక్షన్ మీదుగా తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, పెనుమూడి బ్రిడ్జ్, అవనిగడ్డ, పామూరు గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలని తెలిపాంరు. జాతీయ రహదారి నుంచి బాపట్ల వెళ్లే వాహనాలను బోయపాలెం, ప్రత్తిపాడు మీదుగా బాపట్ల వైపు వెళ్లాలని కోరారు. గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్ళు హెవీ వాహనాలు హైవే లోనికి అనుమతించబోమని తెలిపారు. హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు పేరేచర్ల జంక్షన్ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లాలని, విజయవాడ వైపు అనుమతించబోమని తెలిపారు. చిలకలూరి పేట వైపు నుండి హైదరాబాద్ వైపు వెళ్లుటకు వచ్చే వాహనాలు చిలకలూరిపేట వై జంక్షన్ నుంచి చుట్టుగుంట, పేరేచర్ల మీదుగా వెళ్లాలని కోరారు. మంగళగిరి నుండి విజయవాడ వైపు వెళ్ళుటకు వచ్చే వాహనాలు రేవేంద్రపాడు జంక్షన్ మీదగా తెనాలి, భట్టిప్రోలు, పెనుమూడి ఫ్లై ఓవర్ మీదగా విజయవాడ వైపు వెళ్లాలని కోరారు. అత్యవసర వాహనాలు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి కౌంటింగ్ నిమిత్తం వెళ్ళు వాహనాలును ఏ దారి నుంచి అయినా అనుమతిస్తామని తెలిపారు.

నరసరావుపేటలో ఇలా..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కాకాని గ్రామం వద్ద జెఎన్‌టియు కళాశాలలో ఓట్ల లెక్కింపు సందర్భంగా ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా నరసరావుపేట పట్టణం నుండి పలు ప్రాంతాలకు ట్రాఫిక్ మళ్లింపులు చేయనున్నట్లు

▶ 2లో



పల్నాడు జిల్లా ఎస్పీ మల్లికా గర్గ్

దుకాణాల మూత.. జనం అవస్థ..

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో 144 సెక్షన్ అమలు - జనసంచారం, దుకాణాలు తెరవకుండా ఆంక్షలు

ప్రజాశక్తి - మాచర్ల

అభ్యర్థుల భవితవ్యంపై ఓటర్లిచ్చిన తీర్పును బహిర్గతం చేసేందుకు ఈవీఎంలను తెరవనున్న నేపథ్యంలో దుకాణాలు మూతబడుతున్నాయి. జనసంచారంపై ఆంక్షలు విధించబడ్డాయి. పోలింగ్ రోజునాటి ఘర్షణలు, తాజాగా ఓట్ల లెక్కింపు దృష్ట్యా మాచర్ల నియోజకవర్గంలో పోలీసు బందోబస్తును మరింత పటిష్టం చేశారు. మాచర్ల పట్టణంలో ఇప్పటికే 144 సెక్షన్ అమలవుతుండగా ప్రత్యేక బందోబస్తు గతనెల 14 నుండి కొనసాగుతోంది. మంగళవారం ఓట్ల లెక్కింపు దృష్ట్యా ఘర్షణలు పునరావృతమయ్యే అవకాశం ఉందని భావించి బందోబస్తును మరింత పటిష్టం చేశారు. వ్యాపార సంస్థలను మూసేయాలని ఆదివారం ఉదయం నుండి కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. వీధి విక్రేతలు, తోపుడుబండ్లు, చిరువ్యాపారులను సైతం వ్యాపారాలు చేసుకోవద్దని హెచ్చరించారు. మరోవైపు ఆక్టోపస్ పోలీసులు పట్టణంలో భారీ కవాతు నిర్వహించారు.

మండలంలోని విజయపురిసౌత్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పల్నాడు ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాలతో శనివారం సాయంత్రం నుండే మాచర్ల రూరల్ సిఐ కె.సురేష్, విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో దుకాణాలను

▶ 2లో



సత్తెనపల్లిలో మూతబడ్డ దుకాణాలు



మాచర్లలో పోలీసుల కవాతు

ఈవీఎం ధ్వంసం కేసులో మరొకరు అరెస్టు

ప్రజాశక్తి - రెంటచింతల

పోలింగ్ సందర్భంగా గతనెల 13న తుమృకోటలోని జెడ్‌పి పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం కేసులో మరొకర్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు ఆదివారం తెలిపారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఆరుగుర్ని అరెస్టు చేశామన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని తొమ్మిది గ్రామాల్లో పోలీస్ పికెట్లు కొనసాగుతున్నట్లు ఎస్ఐ చెప్పారు. మొత్తం 11 గ్రామాలకుగాను మల్లవరం, మిట్టగుడిపాడు మినహా మినహా అన్ని గ్రామాల్లోనూ పికెట్లు ఉన్నాయని, ఒక్కో పికెట్ వద్ద ఐదుగురు కానిస్టేబుళ్ల విధుల్లో ఉన్నారని చెప్పారు.

పార్టీలకతీతంగా ప్రజా తీర్పుని గౌరవిద్దాం

కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-తెనాలి

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఈనెల 4న విడుదల కానున్న నేపథ్యంలో కొంతమంది అల్లరి మూకలు అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం ఉందని, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని టిడిపి- జనసేన -బిజెపి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజా తీర్పును పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. పండుగలన్నిటిలోకెల్లా ప్రజా స్వామ్యంలో పెద్ద పండుగ.. ఓట్ల పండుగ అని, ప్రజా స్వామ్యాన్ని కాపాడటానికి ప్రజలు ఓట్లు వేశారని అన్నారు. ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్కరికి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఎవరూ అనవసరంగా ఘర్షణ వాతావరణానికి పాల్పడవద్దని, ఎవరైనా ఘర్షణలకు పాల్పడితారన్న సమాచారం ఉంటే అధికార యంత్రాంగానికి తెలియజేసి అప్రమత్తం చేయాల్సిందిగా కోరారు. ముఖ్యంగా తెనాలిలో ఘర్షణ వాతావరణం ఎప్పుడూ లేదని, అయితే ఈ ఎన్నికల్లోనే స్వల్ప ఉద్రిక్తతలు చోటు చేసుకోవడం బాధా కరమన్నారు. తెనాలి ప్రాంత ప్రశాంత వాతావరణాన్ని చెడ గొట్టడం మంచి సంప్రదాయం కాదని, ప్రజలంతా సంయ మనం పాటించాలని కోరారు.

నేటి రాత్రి నుంచి ట్రాఫిక్ మళ్లింపు

(మొదటి పేజీ తరువాయి)

ఎస్పీ మలిక గర్గ్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నరసరావుపేట పట్టణం, ఇతర ప్రాంతాల నుండి వినుకొండ వైపు వచ్చే వాహనాలను సోమవారం రాత్రి10 గంటల నుండి మంగళవారం కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ భారీ, మధ్య తరహ రవాణా వాహనాలను నరసరావుపేట పట్టణంలోని స్టేషన్ రోడ్, లింగంగుంట్ల, ఇక్కుర్రు, రొంపిచర్ల క్రాస్‌రోడ్ మీదుగా అద్దంకి నార్కెట్‌పల్లి హైవే మీదుగా సంతమగులూరు క్రాస్‌రోడ్ మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు. నరసరావుపేట నుండి ఒంగోలు వెళ్లే భారీ, మధ్య తరహా రవాణా వాహనాలు నరసరావుపేట నుంచి చిలకలూరిపేట వైపు వెళ్లాలని సూచించారు. వినుకొండ రోడ్డు వైపు ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం గ్రామాల మీదుగా వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. అత్యవసర వాహనాలు, ఓట్ల లెక్కింపు నిమిత్తం వెళ్లేవారి వాహనాలకే అనుమతి ఉంటుందని తెలిపారు.

కౌంటింగ్ సెంటర్ వద్ద, పరిసర ప్రాంతాలలో సిసి కెమెరాల నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని, చుట్టుపక్కల ప్రదేశాల్లో పోలీసు డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్‌కు రానున్న ఏజెంట్లు తప్పనిసరిగా వారికి ఇచ్చిన గుర్తింపు కార్డులను తీసుకురావాలన్నారు. కౌంటింగ్‌కు వచ్చే వాహనాలు నిర్ణీత/పోలీసు వారు సూచించిన ప్రదేశంలో పార్క్ చేసి రావలని, ఏజెంట్లు ఎవరి వాహనాలు వారే డ్రైవ్ చేసుకొని రావాలని, డ్రైవర్లకు అనుమతి లేదని తెలిపారు. ఏజెంట్లకు సెల్ ఫోన్స్ అనుమతి లేదన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ సంఖ్యలో రాష్ట్ర పోలీసులు, రాష్ట్ర ప్రత్యేక పోలీసు బలగాలు,కేంద్ర సాయుధ బలగాలుతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో అంతర్ జిల్లా చెక్ పోస్టులు, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేస్తున్నామన్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో కొత్త వ్యక్తులకు అనుమతి లేదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎక్కడా ముగ్గురు కంటే ఎక్కువ మంది గుమ్మికూడరాదన్నారు. ప్రజలు బయటకు రాకుండా ఇళ్లకే పరిమితం కావాలని సూచించారు. రాజకీయ పార్టీల మధ్య గొడవలను, విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు, సామాజిక మాధ్యమాల ద్వారా అటువంటి వాటిని ప్రచారం చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫలితాలు అనంతరం విజయోత్సవ ర్యాలీలకు, బాణాసంచాలు కాల్చడం, సభలు నిర్వహించడం, డీజేలకు అనుమతులు లేవన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు, శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా పోలీసులకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలు జరిగిన చోటే మళ్లీ ప్రమాదాలు!

ఈపూరివారిపాలెం, రామచంద్రాపురం-బొప్పూడి ఆంజనేయ స్వామి గుడి మధ్యలో, లింగంగుంట్ల బ్రిడ్జి వద్ద, గణపవరం, లింగంగుంట్ల రోడ్డు వద్ద నిత్యం ఏదో ఒక ప్రమాదం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఒక పక్క నిబంధనలు పాటించ కుండా రోడ్లు వెడల్పు చేయడం, మరో పక్క రోడ్ల పక్కనే ఉన్న పూడ్చని గోతులు, నిర్లక్ష్యపు డ్రైవింగ్, నిద్రమత్తు, మద్యం మత్తులో వాహనం నడపడం వంటివి రోడ్డు ప్రమాదాలకు కారణాలు అవు తున్నాయి. పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఇటీ వల రోడ్డు ప్రమాదాలే ఇందుకు నిదర్శనం. పగలు, రాత్రి, తెల్లవారుజాము సమ యంలో రోడ్డు ప్రమాదాలు జరుగు తున్నాయి. గతంలో ఏయే చోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయో, అక్కడే పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణ నిమిత్తం ఆయా చోట్ల సంబంధిత బోర్డులు, సిగ్నల్స్, ఇతర స్టిక్కర్లు లాంటివి సంబంధిత శాఖల అధికారులు ఏర్పాటు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తు న్నాయి. స్థానికంగా అన్నంబొట్లవారిపాలెం, పసుమర్తి మధ్యలోని ఈపూరివారిపాలెం వద్ద, రామచంద్రాపురం-బొప్పూడి ఆంజ నేయ స్వామి గుడి మధ్యలో, స్థానిక విజయ బ్యాంకు వద్ద, చిలకలూరిపేట-నరసరావుపేట మార్గంలోని లింగంగుంట్ల బ్రిడ్జి వద్ద, గణపవరం, లింగంగుంట్ల రోడ్డు వద్ద నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగు తూనే ఉంది.ఎవరో ఒకరు ప్రాణాలు పోగొట్టుకుంటునేన్నారు.ప్రధానంగా రాంగ్ రూట్లో వస్తున్న వాహనాలే మృత్యువులా దూసుకెళ్తున్నాయి.

రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం వాహనాల అతివేగమేనని ప్రభుత్వ లెక్క చెబుతున్నాయి. ప్రమాదాలకు మరో కార



అనేక ప్రమాదాలకు నిలయమైన లింగంగుంట్ల,గణపవరం కలిపే రోడ్డు

ణం వాహనచోదకుల నిద్రమత్తు, నిర్లక్ష్యం. వాహనాల వేగాన్ని నియంత్రిం చేందుకు పోలీసులు రవాణాశాఖ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. వాహనాల అతివేగాన్ని నియంత్రిం చేందుకు హైవే పెట్రోలింగ్ పోలీస్‌తో పాటు రవాణాశాఖ అధికారులు తమ యంత్రాలను అక్కడక్కడ అమర్చాలి. నిబంధనలు అతి క్రమించిన వాహనాలపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం జాతీయ రహదారుల పక్కన అటువంటి చర్యలేమీ లేవు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసే వారిపై,లేదా వాహనాల యజమానుల పైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గత ప్రభుత్వం హయాంలో హైవేలపై రాత్రి సమయంలో వాహనాలను ఆపి 'వాష్ ఆన్ గో' అనే కార్య క్రమం నిర్వహించేవారు. వాహనాలను వాటి డ్రైవర్లు తమ ముఖాలను నీటిఇతో కడుక్కునే వరకూ వారిని కదలనిచ్చే వారు కాదు.

రోడ్లపైనా, పక్కనే ఉన్న గుంతలను వెంటనే పూడ్చి వేయాలని, ఒకవేళ రోడ్ల పనులు జరుగుంటే ఇందుకు సంబంధిం చిన బోర్డులను, ప్రమాద స్థలాలను గుర్తించి ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని, డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితి, మధ్యలో తనికి చే యాలని, ప్రమాదాలలో చనిపోయిన వారికి ఏ వాహనం కారణంగా ప్రమాదం జరిగిందో ఆ వాహనదారుడితో ప్రతి ఫలమిచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, ఏదైనా వాహనం మరమ్మతుల నిమిత్తం పక్కన ఆపితే కనుక సిగ్నల్స్ వేయడంతో పాటు బారికేడ్స్, ట్రాఫిక్ కోన్లు, అడ్డు పెట్టేలా హై వే పాట్రోలింగ్ పోలీ సులు దృష్టి సారించాలి. టోల్ ప్లాజాల వద్ద ఫీజ్ వసూలు చేసే కాంట్రాక్టర్ ప్రమా దం జరిగిన వాహనం తరలించేందుకు టోలింగ్ క్రేన్లు ఏర్పాటు చేయాలని, సెల్ ఫోన్లు మాట్లాడుతూ పోరాదనే, పలు విష యాలపై హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని, ప్రతి వాహనానికి వెనుక రిఫ్లెక్షన్ స్టిక్కర్స్ (ఎరుపు స్టిక్కర్) అతికించి ఉంచాలి. ఆయా నిబంధనలు పాటించని వాహనచోద కులపై అధికారుల చర్యలు శూన్యమని, పై వాటిని వెంటనే అమలు జరిగేలా చూడా లని ప్రజలు కోరు తున్నారు. డ్రైవర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇ వ్వాలని , ముఖ్యంగా ఏదైనా వాహనం అనుకోని విధంగా అడ్డువస్తే కనుక ప్రమాదం జరగకుండా తప్పించేలా డ్రైవర్లకు అవ గాహన కల్పించాలి. ఆయా అంశాలపై రవాణా శాఖ, పోలీస్ శాఖలు ఎప్పటి కప్పుడు వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.



పసుమర్రు-అన్నంబొట్లవారిపాలెం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం..



లెక్క తేలేది రేపే!

(మొదటి పేజీ తరువాయి)

లోపలికి అనుమతిస్తారు. పల్నాడు ఎస్‌పి మలికా గర్గ్, గుంటూరు ఎస్‌పి తుషార్ దూడి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మద్యం సేవించి వచ్చే వారికి ముందుగానే లై డిటెక్టర్ పరీక్షలు నిర్వహించి లోపలికి అనుమతిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల తరువాతే అభ్యర్థుల గెలుపు ఓటములపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. 2014లో మంగళగిరిలో వైసిపి అభ్యర్థి రామకృష్ణారెడ్డి 12 ఓట్ల తేడాతో గెలుపొందిన విధంగా ఈసారి కూడా కొన్ని నియోజకవర్గాల్లో టిడిపి, వైసిపి మధ్య నువ్వానేనా అన్న రీతిలో పోటీ జరగడం వల్ల ఆఖరి రౌండ్ వరకూ వేచిచూడాల్సిన పరిస్థితులు రావచ్చునని కొంత మంది అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో ఎక్కువ మంది అభ్యర్థులు ఈసారి తాము అత్యల్ప ఓట్ల ఆధిక్యతతో గెలుపొందుతామని చెప్పుకుంటున్నారు. పోటీ తీవ్రంగా ఉన్నందున రెండు మూడు వేల ఓట్ల ఆధిక్యతతో బయటపడతామని అటు టిడిపి, ఇటు వైసిపి అభ్యర్థులు అంచనాల్లో ఉన్నారు. అందువల్ల మొదటి ఐదారు రౌండ్లలో భారీ ఆధిక్యత ఉంటే తప్ప గెలుపు గ్యారంటీ ఉండదు. ఇందుకోసం చివరి రౌండ్ వరకూ వేచిచూడక తప్పదని అంటున్నారు. వైసిపి, టిడిపి ఎన్నికల ఖర్చులోనూ పోటాపోటీగా చేసినందు వల్ల కౌంటింగ్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఏదైనా వార్ వన్‌సైడ్ ఉండే అవకాశాలు తక్కువనే భావన రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. దీంతో అభ్యర్థుల్లో టెన్షన్ పెరుగుతోంది.



దుకాణాల మూత.. జనం అవస్థ..

(మొదటి పేజీ తరువాయి)

మూసేయించారు. ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జనం రోడ్ల పైన గుంపులు గుంపులుగా తిరగకూడదని ఆదేశించారు. దుకాణాలు ఎవరు తెరవకూడదని, నిబంధనలు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 144 సెక్షన్ అమలు కారణంగా విజయపురిసౌత్‌లోని మేరీమాత ఆలయానికి ఆదివారం తాళాలు వేశారు. ఇది తెలియక ఆలయ సందర్శనకు వచ్చిన కొందరు వెనుతిరిగారు.

నెహ్రూ నికేతన్ లిటిల్ వండర్స్ ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి

స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకున్న నెహ్రూ నికేతన్ విద్యాసంస్థలు నూతనంగా చెంచుపేటలో 'నెహ్రూ నికేతన్ లిటిల్ వండర్స్'పేరిట నూతన బ్రాంచ్ ని ఏర్పాటు చేశారు. ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభం కానున్న నేప థ్యంలో పాఠశాలలో ఎల్లాప్రగడ పవన్ కుమార్ శర్మ, గొర్తి ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి లక్ష్మీ గణపతి సహిత హోమం నిర్వహించారు. నెహ్రూ నికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మురళీ కాంత్ దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ పాల్గొన్న కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో నర్సరీ నుంచి 5వ తరగతి వరకు డిజి టల్ తరగతులు ప్రారంభిస్తామన్నారు. విద్యాసంస్థల నిర్వ హణలో 50 సంవత్సరాల సుదీర్ఘ అనుభవంతో ఏర్పాటు చేస్తున్న విద్యాసంస్థ సేవలను విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ నికేతన్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డి .ప్రకాశరావు, రంగలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మురళీ కాంత్, గీతా కాంత్

ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులు కార్మికులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుడదనే ఉద్దేశంతో పోలీసులు శనివారం సాయంత్రం 5 గంటల నుండి దుకాణాలు మూయించారు. పట్టణంలో 144 సెక్షను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. దుకాణాలు మూతపడటంతో నిత్యావసర సరుకుల కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూవారీ ముఠా కార్మికులు జీవనోపాధి కోల్పోయారు. రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారులు ఉపాధికి గండిపడింది. హోటళ్లు, అల్పాహార బండ్లకు కూడా పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో వాటి నిర్వాహకులు, వాటి వద్ద పని చేసేవారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల మూత నేపథ్యంలో ఇదే అదునుగా భావించిన కొంతమంది చాటుమాటుగా నిత్యావసర సరుకులు విక్రయిస్తూ అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఆదివారం ఉదయం మాంసం, చికెన్, చేపల విక్రయిస్తున్న వారిపై పోలీసులు జులూం ప్రదర్శించడంతోపాటు మూసేయించడం విమర్శలకు కారణమైంది.



పదవీ విరమణ చేసిన విజయ రాజును సత్కరిస్తున్న సిపిఎం నాయకులు

విజయరాజు దంపతులకు సిపిఎం సన్మానం

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్

గత 32 సంవత్సరాలుగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ లో వివిధ రకాల బాధ్యతలను నిర్వర్తించి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా శుక్రవారం పదవీ విరమణ చేసిన నాగ పోగు విజయరాజు తాను చేసే వృత్తిలో నిబద్ధతతో పని చేశారని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు ప్రశంసించారు. ఆదివారం రాత్రి ఎంటిఎంసీ పరిధిలోని గుండిమెడలో పదవి విరమణ చేసిన విజయరాజు దంపతులను సిపిఎం మండల నాయకులు ఆయన స్వగృహంలో కలిసి, పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ విజయరాజు తన వృత్తి తాను చేసుకుంటూ, సిపిఎం శాఖ ను నిర్వర్తించారని అన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో పార్టీ బలోపేతానికి, కార్మిక ఉద్యమానికి తోడ్పాటు అందించాలని కోరారు. సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం, గ్రామంలోని స్థానిక సమస్యల పైన విజయ్ రాజు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, కంచర్ల సాంబ శివరావు, సిపిఎం రాజధాని నాయకులు కొర్రపోలు ఈశ్వరరెడ్డి, నాయకులు గుడివాడ సామ్యవాదం, బత్తుల సంసోను, పల్లె భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



'చలపతి'లో చెస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-తాడికొండ

లాం చలపతి ఫార్మసి కళాశాలలో చెస్ పోటీలు ఆదివారం ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్,ఆనంద్ చెస్ వింగ్స్ నిర్వహణలో పోటీలను ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి 292 మంది ఈ పోటీలలో పాల్గొనడం జరిగింది అంతర్జాతీయ క్రీడాకారులు 87 మంది పాల్గొన్నారు. మొదటి రోజు ఏడు స్లాబులుగా 5 రౌండ్లు ముగిశాయని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు కార్యక్రమంలో ఆనంద్ చేసాకడమీ డైరెక్ట్ ఎం గోపీనాథ్ ఆంధ్ర ప్రదేశ్ అసోసియేషన్ సభ్యులు కళాశాల చైర్మన్ వైవి ఆంజనేయులు పాల్గొన్నారు.



5 వరకు దుకాణాలు బంద్

ప్రజాశక్తి - క్రోసూరు

ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఆదివారం నుంచి ఈ నెల 5 వరకు వ్యాపార దుకాణాలు ఇతర సభలు, సమావేశాలు నిర్వహించ రాదని క్రోసూరు మండల ఎస్ఐ షఫీ తెలిపారు. శాంతి భద్రతల పరిక్షణకు ఎస్ఐ షఫీ పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ర్యాలీలు, ఊరేగింపులు పూర్తిగా నిషేధమని, దీనిని దృష్ట్యా ఆయా పార్టీల నాయకులు తమకు కోరారు. సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలతో శాంతి భద్రతల రక్షణకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే పిడి యాక్టు, రౌడీ షీటు ఓపెన్ చేసి జిల్లా బహిష్కరణకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'గ్రామాల్లో నిత్యావసర వస్తువుల దుకాణాలు మినహా.. ఇతర వాణిజ్య దుకాణాలు తెరవ కూడదని స్పష్టం చేశారు.

గొడవలకు పాల్పడవద్దు



ప్రజాశక్తి - వినుకొండ

జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో పట్టణంలోని వర్తక వ్యాపారాలను సకాలంలో మూసి వేయాలని వినుకొండ పట్టణ సిఐ సాంబశివరావు వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో వినుకొండ పట్టణ సీఐ సాంబశివరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ ఆదేశాల ప్రకారం పల్నాడు జిల్లాలో 144 సెక్షన్,పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు ఎక్కడ గుమిగూడదద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీస్ వారికి సహకరించాలని కోరారు. ఎవరు గొడవలకు పోవద్దని, కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు.

మహిళ అదృశ్యం



ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి ద్వారకా నగర్‌కు చెందిన నల్లగొర్ల సంపూర్ణ.. 60 సంవత్సరాల వృద్ధ మహిళ అదృశ్యమైనట్టు ఆమె భర్త నల్లగొర్ల శివయ్య శనివారం రాత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంపూర్ణ మతిస్థిమితం లేకపోవడంతో శని వారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లినట్లు చెప్పారు. ఎరుపు రంగు శరీర ఛాయ, పచ్చ రంగు చీర ధరించిన సంపూర్ణ ఆచూకీ తెలిసినవారు పోలీసులకు కానీ, 9010134316 నంబర్‌లో కానీ తెలియజేయాల్సిందిగా శివయ్య కోరారు.



ఆగి ఉన్న లారీ దగ్ధం

ప్రజాశక్తి -రెంటచింతల

మండలంలోని మిట్టగుడిపాడులో ఆదివారం వేకువజామున ఓ లారీ దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టు నుండి బొగ్గు లోడుతో వచ్చిన లారీ దాచేపల్లి లోనే శెట్టి నాడు సిమెంట్ ఫ్యాక్టరీలో అన్లోడ్ చేసింది. అక్కడి నుండి మిట్టగుడిపాడు లో నాపరాయి లోడుకు వెళ్లింది. లారీలో ఐదు కేజీల గ్యాస్ సిలిండర్ కూడా ఉంది. లారీ డ్రైవర్ నాగరాజు అదే గ్రామానికి చెందిన వాడు కావడంతో ఇంటికి వెళ్ళాడు . వేకువజామున లారీ తగలబడుతున్నట్లు తెలుసుకొని అక్కడికి వచ్చి అగ్నిమాపక శాఖ వారికి ఫిర్యాదు చేశాడు. మాచర్ల నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పినట్లు ఫైర్ ఆఫీసర్ సునీల్ తెలిపారు. ఘటనా స్థలాన్ని గురజాల డి.ఎస్.పి శ్రీనివాసరావు సందర్శించారు కావాలనే లారీని కాల్చారని అనుమానం ఉన్నట్లు వ్యక్తం చేశారు.



దుర్గిలో పోలీస్ కవాతు

ప్రజాశక్తి-దుర్గి

ఈ నెల 4న ఎన్నికల ఫలితాలు వెలు వడనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉంది. ఈ సందర్భంగా దుర్గి ఎస్ఐ కోటయ్య ఆధ్వర్యంలో కేంద్రబలగాలతో కవాతు నిర్వహించారు.



పవర్ లిఫ్టింగ్ విజేతలతో కోచ్ సాయిరేవతి

పవర్ లిఫ్టింగ్ లో తెనాలి క్రీడాకారులకు పతకాలు

ప్రజాశక్తి-తెనాలి

తెనాలికి చెందిన క్రీడాకారులు పవర్ లిఫ్టింగ్ పోటీలలో పతకాలు సాధించారు. క్విక్ ఫిట్నెస్ ఎరేనా కోచ్ జి.సాయి రేవతి ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం మంగళగిరిలో గత నెల 29 నుంచి 31 వరకు జరిగిన 11వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో తెనాలి క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో మధిర షనూన్ 43 కేజీల విభాగంలో రెండు బంగారు పతకాలను, సీనియర్ 47 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ పొందారు. 93 కేజీల విభాగంలో సంకా కౌశిక్ ఒక గోల్డ్, ఒక బ్రాంజ్ మెడల్, ప్లస్ 120 కేజీల విభాగంలో పడాల దేవేంద్ర రెడ్డి 2 బంగారు పతకాలను, సీనియర్ విభాగంలో ఒక సిల్వర్ మెడల్ ను, 120 కేజీల విభాగంలో పి శివరామ కిరణ్ రాజు సిల్వర్ మెడల్, జూనియర్ 83 కేజీల విభాగంలో కె.శ్రీకాంత్ నాలుగో స్థానంలో నిలిచారని చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

ఆనంద శరణాలయంలో అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పెనుమాక మాజీ సర్పంచి కళ్ళం పానకాల రెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు, కుమారుడు కళ్ళం రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం చినకాకాని ఫైన్ ఆనంద శరణాలయంలో బాల బాలికలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పానకాలరెడ్డి ఆదాయంలో 20 శాతం సమాజ సేవకు ఖర్చు పెట్టాలని చెబుతూ ఉండేవారని, ఆయన మాటలను ఆదర్శంగా తీసుకొని కళ్ళం ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. సర్పంచిగా పానకాల రెడ్డి గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండేవారని గుర్తుచేసుకున్నారు. శరణాలయంలో బాలబాలికలకు అన్ని సదుపాయాలు కల్పిస్తూ వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో కళ్ళం శివ గోవిందరెడ్డి, కరుణాకర్ రెడ్డి, చేతన్ రెడ్డి, భీమవరపు సురేందర్ రెడ్డి, తురక నరేష్, గుడిపూడి చలపతి, తేజ, ఫణి, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



శరణాలయంలో బాలబాలికలకు అన్నం వడ్డిస్తున్న కళ్ళం రాజశేఖర్ రెడ్డి తదితరులు

గెలుపోటములపై పెద్ద ఎత్తున బెట్టింగ్‌లు

- ఉత్కంఠ రేపిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు
- పెద్ద మొత్తంలో చేతులు మారుతున్న డబ్బు

ప్రజాశక్తి-మాచర్ల

ఆంధ్రప్రదేశ్‌లో ఎవరు అధికారం చేపడతారనే విషయంపై శనివారం విడుదలైన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు మరింత ఉత్కంఠ రేపాయి. పలు సర్వే సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్ ఫలితాల్లో కొన్ని అధికారపక్షంవైపు మరికొన్ని ప్రతిపక్ష పార్టీ వైపు మొగ్గుచూపడంతో ఎవరు గెలుస్తారోననే విషయం ఉత్కంఠ మరింత పెరిగింది. ఎగ్జిట్‌పోల్స్ ప్రభావం బెట్టింగ్ సరళిపై కూడా పడింది. మాచర్ల నియోజకవర్గ పరిధిలో రెండు రోజుల క్రితం వరకు కూటమి అభ్యర్థుల విజయంపై ధీమాగా ఉండి, లక్షకు లక్షన్నర వరకు ఇస్తామంటూ బెట్టింగులకు పాల్పడ్డ బెట్టింగ్ రాయుళ్ళు ఎగ్జిట్ పోల్స్ అనంతరం ఒక అడుగు వెనుకకు వేసినట్లు కనపడుతుంది. ఆ పందేలలో కూడా తెలుగుదేశం వైపే ఎక్కువగా బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిసింది. ఈ సర్వే ఫలితాలు వెనుక పెద్దస్థాయి బెట్టింగ్ మాఫియాలు ఏవైనా వున్నాయా? మాఫియాలకు సంబంధించిన సర్వేలు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను వెల్లడిస్తున్నాయని అనుమానిస్తున్నారు. ఫేక్ సర్వేలు వెల్లడిస్తూ వారికి అనుకూలంగా బెట్టింగులు జరిగేలా చూస్తున్నారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మాచర్ల నియోజకవర్గంలో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారుతున్నట్లు తెలిసింది. కోట్ల రూపా యల్లో బెట్టింగ్ జరుగుతున్నట్లుగా తెలుస్తుంది. కొందరు ఆస్తులు కూడా పందెం పెడుతున్నట్లుగా తెలు స్తుంది. ప్రధాన పార్టీల్లో ఎవరు గెలుస్తారనే విషయమై నెలకొన్న ఉత్కంఠకు ఈ నెల 4వ తేదీన వెలువడనున్న ఫలితాలతో తెరపడనుంది.

భవన నిర్మాణాలు చేపట్టే వారు

రోడ్డుపై రాళ్లు ,కర్రలు లేకుండా చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉన్నతాధికారుల ఆదే శాల మేరకు పల్నాడు జిల్లాలో ఆయా గ్రామ పం చాయతి పరిధిలో భవన నిర్మాణాలు చేపట్టే వారు రోడ్లపై కంకర రాళ్ళు, కర్రలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని నరసరావుపేట ఈవోపీఆర్డీ కెవి శివ ప్రసాద్ సూచిం చారు. ఈ మేరకు పంచాయతి కార్యదర్శులకు ఆయన పలు సూచనలు చేశారు. ఆదివారం నరసరావుపేట మండలంలోని పెట్లూరువారి పాలెంలో పర్యటించి భవన నిర్మాణాలు చేపట్టే ప్రదే శాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటి యజ మానులకు ఆయన పలు సూచనలు చేశారు. జిల్లా పంచాయతి అధికారి ఆదేశాల మేరకు గ్రామాలను సందర్శించినట్లు చెప్పారు. కొత్తగా భవన నిర్మాణ పనులు చేపట్టే వారు కంకర రాళ్ళు, కర్రలు అందుబాటులో లేకుండా చూసుకోవాలన్నారు. పోలింగ్ రోజున జరిగిన హింసాత్మక ఘటనల దృష్ట్యా ప్రత్యేకంగా సమ స్యాత్మక గ్రామాల్లో రెవిన్యూ,పోలీసు శాఖ అప్రమత్తంగా, సమన్వయంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. వివాదాల నేపథ్యంలో భవన నిర్మాణాల వద్ద నిల్వ చేసిన రాళ్లను కర్రలను దాడికి ఉపయోగిస్తే భవన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



భవన నిర్మాణ దారులతో మాట్లాడుతున్న కెవి.శివప్రసాద్

పేదల పొట్టగొడుతున్న అప్రకటిత కర్ఫ్యూ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో విధించిన 144 సెక్షన్ అమలు, ఎవరూ బయట తిరగ్గాడదనే అప్రకటిత కర్ఫ్యూ అమలతోంది. చిలకలూరిపేట పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోనూ దుకాణాలను పోలీసులు ఆదివారం ఉదయం నుండే మూసేయించారు. హోటళ్లు, లాడ్జీల్లో తనిఖీలు చేపట్టారు. అయితే మద్యం దుకాణాలకు మాత్రం నిబంధనలేమీ లేకుండా యథేచ్ఛగా కొనసాగనిస్తున్నారు. మరోవైపు తాజా పరిస్థితులతో చిరువ్యాపారులు, ఏ పూటకాపూట పని చేసుకుని సరుకులు కొనుక్కునే సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాల్లో జరిగిన అల్లర్లు తమకూ ఇబ్బందులు తెచ్చిపెట్టాయని నిట్టూరుస్తున్నారు. త్వరగా పాడయ్యే కూరగాయలు, పండ్లు వంటివి విక్రయించేవారు ఇప్పుడు వాటిని అమ్ముకోలేక నష్టపోతున్నామని వాపోతున్నారు. ఇదిలా ఉండగా కూలి పనుల కోసం ప్రతిరోజూ అడ్డాల్లో నిరీక్షించే కూలీలకు తాజా పరిస్థితితో అవస్థలు వచ్చిపడ్డాయి. తమను ఎవరైనా పనికి పిలుస్తారేమోనని కూలీలు అడ్డాల్లో నిల్చున్నా, కూర్చునా పోలీసులు వచ్చి చెదరగొతున్నారు. పని చేసుకుంటే గాని పూటగడవని కూలీలపైనా పోలీసులు ప్రతాపం తగతదని, పేదల ఉపాధికి ఇబ్బందుల్లేకుండా చూడాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు కోరారు.



మూతబడ్డ మార్కెట్‌లోని దుకాణాలు

కౌల్దార్లకు కార్డులు, పంట రుణాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దేశానికి వెన్నెముకైన వ్యవసాయ రంగం, రైతులు సుభిక్షంగా ఉంటే దేశం అభివృద్ధి చెందినట్లేనని ప్రభుత్వాలు గ్రహించాలని, వ్యవసాయ రంగానికి రాయితీలతో పాటు ప్రాధాన్యమిచ్చి ప్రోత్సహించాలని కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు కోరారు. ప్రస్తుతం సాగుదారుల్లో 70 శాతం కౌలురైతులేనని, వారిని నిబంధనలేమీ లేకుండా ఆదుకోవాలని కోరారు. కౌల్దార్లకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు, వ్యవసాయ ఉపకరణాలు, విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డుల్లేక కౌల్దార్లు రాయితీలు, పథకాలు పొందలేకపోతున్నారని, పంటనూ అమ్ముకోలేకపోతున్నారని గుర్తు చేశారు. సామాజిక తరగతుల ఆధారంగా కొంతమంది కౌల్దార్లను రైతు భరోసాకి అనర్హులుగా చేయడం తగదన్నారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గ్రామ సభలు జరిపి కౌలు రైతులను గుర్తించాలని, అధికారంలోకి వచ్చే ప్రభుత్వం ఏదైనా దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గుర్తింపుకార్డులున్న కౌల్దార్లకూ బ్యాంకులు రుణాలివ్వడం లేదని, భూ యజమానికి రుణం ఇవ్వడం వల్ల ఇలా జరుగుతోందని బ్యాంకర్లు అంటున్నారని చెప్పారు. భూ యజమాని ముందుగా బ్యాంకులో రుణం తీసుకొని ఉంటే వాటిని దీర్ఘకాలిక రుణాలుగా పరిగణించి వాస్తవ సాగుదారులకే పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జగన్ అరాచకాలతో ప్రజలు విసిగిపోయారు : జీవీ

ప్రజాశక్తి - వినుకొండ



రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి గెలవబోతోందని కూటమి తరుపున వినుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జీవి ఆంజనేయులు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలన, జగన్ అరాచకాల పట్ల ప్రజలు ఎంతగా విసిగి పోయారో ఎగ్జిట్ పోల్ ఫలితాల ద్వారా తెలుస్తోందన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలనే కృతనిశ్చయంతో ప్రజలు ఓట్లేశారని అన్నారు. పోలవరం నిర్మాణం, అమరావతి పూర్తి, యువతకు ఉద్యోగాలు, అన్నివర్గాల ప్రజలకు సంక్షేమం టిడిపితోనే సాధ్యమని జనం తమకు మద్దతిచ్చారని అన్నారు. వైసిపి దాడులను తట్టుకుంటూ చంద్రబాబు అలుపెరగని పోరాటం ఫలితమే నేటి ఈ ఫలితాలన్నారు. రాష్ట్రం కోసం, ప్రజల కోసం, రాష్ట్ర భవిష్యత్ కోసం, రాష్ట్రంలో రాజ్యాంగాన్ని కాపాడడం కోసం యుద్ధమే చేశారని, వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కబ్జాలకు ఇక కాలం చెల్లిందని అన్నారు. నరసరావుపేట ఎంపీ స్థానం, ఏడు అసెంబ్లీ స్థానాలు టిడిపి గెలుస్తుందని చెప్పారు.

కూటమి పార్టీల ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఎటువంటి ఆవేశాలకూ లోను కాకుండా వ్యవహరించాలని, లెక్కింపును నిశితంగా పరిశీలిస్తూ ఉండాలని చెప్పారు. ఎగ్జిట్ పోల్స్ అన్ని కూటమి అభ్యర్థులకు అనుకూలంగా ఉన్నందున, ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులు గొడవలు సృష్టించి కూటమి పార్టీలకు చెందిన ఏజెంట్ల దృష్టిని మరల్చి ఫలితాలను తారు మారు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వారి ఏజెంట్లకు దిశా నిర్దేశనం చేశారని, అందుకే కూటమి పార్టీల వారు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ ఏజెంట్లుగా వెళ్లినవారు కౌంటింగ్ పూర్తయి ఎన్నికల అధికారి ఫలితం ప్రకటించి అభ్యర్థికి ఎన్నిక ధ్రువ పత్రాన్ని ఇచ్చేంతవరకూ కౌంటింగ్ హాలు నుండి బయటకు రావొద్దని చెప్పారు.

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఓట్ల లెక్కింపు సందర్భంగా నరసరావుపేట మండలంలోని కాకాని గ్రామ పరిధిలో గల జె.ఎన్.టి.యు కళాశాలలో ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రం వద్ద భద్రత, కేంద్రం వద్ద మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్, ఎస్పీ మలిక గర్గ్ ఆదివారం పరిశీలించారు. సిబ్బంది కౌంటింగ్ సెంటర్లకు వెళ్లే మార్గాలలో ఏర్పాటు చేసిన బారికేడ్‌లను, గుర్తింపు చిహ్నాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. నియోజకవర్గాల వారిగా మొబైల్ ఫోన్లో భద్రపరిచే స్థలాలను పరిశీలించారు. పోలీసు సిబ్బందితో సమావేశమై భద్రత ఏర్పాట్లు గురించి వివరాలు సేకరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పరిశీలనలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



భద్రత, ఇతుర ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లత్కర్, జెసి శ్యామ్‌ప్రసాద్

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు క్రీడాకారుల సత్తా

రాష్ట్రస్థాయి పోటీల్లో 11 బంగారు, 4 రజత, 3 కాంశ్య పతకాలు కైవసం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీల్లో 18 పతకాలను కైవసం చేసుకుని పల్నాడు జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో గతనెల 29, 30, 31 వరకు జరిగిన 11వ రాష్ట్రస్థాయి పోటీల్లో పల్నాడు జిల్లాకు చెందిన 10 మంది క్రీడాకారులు 11 బంగారు, 4 రజత, 3 కాంస్య పతకాలను మొత్తంగా 18 పథకాలను సాధించారు. ఎన్.శరత్ (వెన్నాదేవి) జూనియర్స్, సీనియర్స్ స్ట్రాంగ్ మెన్‌గా టైటిల్ కైవసం చేసుకున్నారు. జూనియర్ మహిళలు 53 కిలోల విభాగంలో రొంపిచర్లకు చెందిన ఎం.అనూష రజత పతకం, 76 కిలోల విభాగంలో టి.నాగజ్యోతి బంగారు పతకం, జూనియర్, సీనియర్ పురుషుల 66 కిలోల విభాగంలో వెన్నాదేవికి చెందిన ఎన్.శరత్ 2 బంగారు పతకాలు, 66 కిలోల విభాగంలో దాచేపల్లి, పెదగర్లపాడుకు చెందిన ఎం.అశోక్ కుమార్ (కాంస్యం), 74 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన పి.వంశీకృష్ణ 2 బంగారు, రెండు రజత పతకాలు, 120 కిలోల విభాగంలో గుడిపూడికి చెందిన ఎల్.శివనాగేశ్వరరావు 4 బంగారు పతకాలు సాధించారు. సబ్ జూనియర్ మెన్ బెంచ్‌ప్రెస్ 53 కిలోల విభాగంలో కె.కార్తీక్ కాంస్యపతకం, 66 కిలోల విభాగంలో ఎస్‌కె మొహిద్దిన్ బంగారు పతకం, సీనియర్ బెంచ్‌ప్రెస్ 66 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన టి.గోపీ కాంస్యం పతకం, 83 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన షేక్ నజీర్ బంగారు పతకం, 83 కిలోల మాస్టర్స్-2 విభాగంలో క్రోసూరుకు చెందిన జె.జేమ్స్ రజత పతకం సాధించారు. వీరిని పల్నాడు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి, అంతర్జాతీయ క్రీడాకారులైన పసుపులేటి సురేష్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు జిమ్ రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.సాంబశివరావు, కె.పవన్, పి.అశోక్ కుమార్, పి.రాహుల్ గౌతమ్, జి.రమేష్, శాంతయ్య అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

వ్యర్థాల నిర్వహణతో బహుముఖ ప్రయోజనాలు

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని జాలలపాలెంలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం.మహతి ఆధ్వర్యంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వినుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కెఎస్‌ఎంవి నాయుడు అధ్యక్షత వహించగా న్యాయమూర్తి ఎం.మహతి మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణ గురించి అవగాహన కల్పించారు. వంటింటి నుంచి, గార్డెన్ నుంచి వచ్చే వ్యర్థాలను, మిగిలిపోయిన ఆహారాన్ని మొత్తం తడి వ్యర్థాలుగా, ప్లాస్టిక్, పేపర్ వ్యర్థాల్ని పొడి వ్యర్థాలుగాను, గడువు ముగిసిన మందులు ఉపయోగించిన పెయింట్, డ్రమ్స్, బ్యాటరీలు, సిరంజిలు, గాజు వస్తువులు, సానిటరీ వేస్టు ఇంట్లోనే ప్రమాదకరమైన వ్యర్థాలుగా ఎలా వేర్వేరుగా విభజించాలో వివరించారు. ప్లాస్టిక్ బాటిల్స్‌ను రీసైక్లింగ్ చేయడం ఎలాగో చెప్పడంతోపాటు ప్రయోజనాలను వివరించారు. ఇలా చేయడం వల్ల పరిసరాల పరిశుభ్రతతో పాటు తక్కువ కాలుష్యం, పర్యావరణ అనుకూలమైనదిగా ఉంటుందని అన్నారు. న్యాయ వాదులు లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలో వివరిస్తూ దానికి కావాల్సిన అర్హతలు గురించి అవగాహన కల్పించారు. ఎవరికైనా న్యాయ సహాయం అవసరమైతే కోర్టులోని లోక్ అదాలత్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ పఠాన్ గౌస్ మొహిద్దీన్ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ గాలి నాగరాజు, వి.అమర్‌బాబు, బి.రామ్మోహన్‌రావు, నలబోలు సోమశేఖర్, ఎం.చంటి, కె.రమేష్‌బాబు, టి.పుష్పకుమార్, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి మహతి

కౌంటింగ్‌కు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపునకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు.ఆదివారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో కౌంటింగ్ కోసం చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. సమావేశంలో మంగళగిరి నియోజకవర్గ ఆర్ఓ జి.రాజకుమారి, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఆర్ఓకీర్తి చేకూరి, తెనాలి నియోజకవర్గ ఆర్ఓ ప్రఖార్ జైన్, ప్రత్తిపాడు రిటర్నింగ్ అధికారి పి.శ్రీకర్, తాడికొండ ఆర్ఓ గంగరాజు, పొన్నూరు ఆర్ఓ లక్ష్మికుమారి, పశ్చిమ నియోజకవర్గ ఆర్ఓ కె.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



నంద ను అభినందిస్తున్న జంగాల అజయ్‌కుమార్ తదితరులు

పవర్ లిఫ్టర్‌కు సిపిఐ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

పవర్ లిఫ్టింగ్, బెంజ్‌ప్రెస్ పోటీలలో రాష్ట్రస్థాయిలో రెండు రజిత పతకాలు సాధించిన న్యాయవాది పర్చూరు నంద ని సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ఆదివారం స్థానిక కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో అభినందించారు.మే 29 నుండి 31 వరకూ మంగళగిరిలో జరిగిన రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో పట్టణానికి చెందిన న్యాయవాది, మాజీ ఎఐఎస్ఎఫ్ నాయకురాలు నంద సీనియర్స్ మహిళల విభాగంలో 76 కేజిల విభాగంలో పోటీపడి పవర్‌లిఫ్టింగ్‌లో 282.5 కేజిల బరువు ఎత్తి రజిత పతకం సాధించారన్నారు. అలాగే బెంచ్‌ప్రెస్ పోటీల్లో తలపడి మరొక రజిత పతకం సాధించాందన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, మంగళగిరి కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుండే సివిల్స్ లక్ష్యంగా ఉండాలి : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి-గుంటూరు

పాఠశాల స్థాయి నుండే సివిల్ సర్వీసెస్ సాధన లక్ష్యంగా కలిగి ఉండాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్, కెవిఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ కార్యాలయంలో జరుగుతున్న ఐఎఎస్ ఫౌండేషన్ క్లాసులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్ర మంలో లక్ష్మణరావు మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ సాధిం చాలంటే జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలని చెప్పారు. అందువల్ల క్లాసులలో మెంటల్ ఎబిలిటీ, జనరల్ సైన్స్, పాలిటీ, జాగ్రఫీ, ఇంగ్లీషు మొదలైన అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పించామని చెప్పారు. కరెంట్ ఎఫైర్స్ కోసం రెగ్యులర్‌గా దినపత్రికలు ముఖ్యంగా ఎడిటోరియల్ పేజీలను చదవాలని చెప్పారు. సివిల్ సర్వీసెస్ పరీక్షకు అర్హతలు, సిలబస్, పరీక్ష విధానం, ప్రిపరేషన్ మొదలైన అంశాలను వివరించారు. ముగింపు సభలో జన విజ్ఞాన వేదిక నాయకులు బి.ప్రసాద్, జి.వెంకట రావు, జివివి.సుబ్బరాయుడు, సన్ సమన్వయకర్తలు సాయి, ఆషిష్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన విద్యార్థులతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు



సృజనకార్ పత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

విశ్వబ్రాహ్మణుల్లో చైతన్యం రావాలి

ప్రజాశక్తి-గుంటూరు :విశ్వబ్రాహ్మణులలో సామాజిక, రాజకీయ చైతన్యం సంఘటితశక్తి లేనంత కాలం వర్తమాన సమాజంలో బానిసలుగానే బతకాల్సి వస్తుందని సజనకార్ పత్రిక ప్రధాన సంపాదకులు కొత్తపల్లి సీతారామాచార్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక అరండల్‌పేట దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామాచార్యులు మాట్లాడుతూ పంచవత్తులైన వడ్రంగం, శిల్పం, బంగారం, ఇత్తడి, కమ్మరంల ద్వారా నాగరిక సమాజానికి అన్ని అవసరాలను తీరుస్తున్న విశ్వబ్రాహ్మణులు ఆదిపత్య కులాల రాజకీయాల ఆటలో దశాబ్దాలుగా ఓటు బ్యాంకుగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ జనాభాలో నాలుగున్నర శాతంగా ఉన్న అతిపెద్ద ఏడవ జనాభా కలిగిన విశ్వబ్రాహ్మణుల అనైక్యత ద్వారానే ప్రధాన రాజకీయ పార్టీలు వారికి రావలసిన రాజకీయ వాటాలు ఇవ్వటం లేదన్న సంగతి జాతి గుర్తించాలని కోరారు.కార్యక్రమంలో సజనకార్ పత్రిక బాధ్యులు సుధాకర్‌రావు, హైకోర్టు న్యాయవాది వేణుగోపాలరావు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కడియాల సుబ్బారావు ప్రసంగించారు.కందుకూరి లక్ష్మీనారాయణ సభకు అధ్యక్షత వహించగా సభలో చైతన్యాన్ని పెంపొందించే 'ఆత్మ ది సోల్', 'సింహాద్రి అప్పన్న', లఘు చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 'సజన కార్' పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఏంవి ప్రసాద్, శంకర్‌శాస్త్రి, గోనుగుంట్ల శేషగిరిరావు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

కాల్వలకు మరమ్మతులు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కాలువలకు వెంటనే మరమ్మతు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్ డిమాండ్ చేశారు. రాజధాని రైతు సంఘ సమావేశం ఆదివారం ఉండవల్లి సెంటర్లో కె.ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ ఉండవల్లి పంపింగ్ స్కీమ్ కింద సాగుబడికి ఇబ్బంది లేకుండా కాలువల్లో పేరుకుపోయిన తూటుకాడ, గుర్రపుడెక్క తొలగించాలన్నారు. వర్షాకాలం వస్తున్న తరుణంలో వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు కౌలు రెండు సంవత్సరాల నుంచి వేయలేదన్నారు. దీని వల్ల ఎంతో మంది పేద రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజధాని ప్లాట్లలో జంగిల్ క్లియరెన్స్ చేయాలన్నారు. ఈ సమావేశంలో షేక్ ఎర్రపీరు, నాగేశ్వరరావు, గణేష్, బక్కిరెడ్డి పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు అప్రమత్తంగా ఉండాలి

పోలీస్ అధికారులు - జిల్లాలో 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ అమలు



ప్రజాశక్తి-తాడేపల్లి

కట్టుదిట్టమైన భద్రత మధ్య 4న ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు తెలిపారు. ఓట్ల లెక్కింపులో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ ముగిసే వరకు అన్ని విధాలుగా అప్రమత్తంగా ఉంటామని అన్నారు. తాడేపల్లి పట్టణంలో 114 సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. ఎలాంటి ర్యాలీలకు, విజయోత్సవాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కౌంటింగ్ రోజు ఒక్క కేసు నమోదైనా రౌడీషీట్ పెట్టడంలో వెనుకాడబోమని హెచ్చరించారు.



ప్రజాశక్తి -పొన్నూరు

ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పొన్నూరు రూరల్ మండల గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాల నిఘాతోపాటు పోలీస్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు పొన్నూరు రూరల్ ఎస్సై బండ్ల భార్గవ్ తెలిపారు. ఆదివారం మీడియా తో మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధన మేరకు 4 తారీఖు ఫలితాల అనంతరం గ్రామాల్లో బహిరంగ ర్యాలీలు, బాణాసంచా, బైక్ ర్యాలీలు నిషేధించడమైనదని తెలిపారు. ఫలితాల అనంతరం విజయోత్సవ కార్యక్రమాల కోసం అనుమతులు తప్పనిసరి అని సూచించారు. అక్రమ మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లోని ప్రజలు పోలీసు వారి సూచనలు పాటించి సహకరించాలని ఎస్సై భార్గవ్ తెలిపారు.



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఈనెల 3 తారీకు నుంచి 5 తారీకు వరకు బహిరంగ ప్రదేశాలలో షాపుల వద్ద ప్రజల ఎవరు గుమ్మికూడి ఉండరాదని రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్ తెలిపారు. రౌడీ షీటర్లకు ట్రబుల్ మాంగర్లకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. యువత బైక్ ర్యాలీలకు, ఘర్షణలకు, గొడవలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండాలని రూరల్ ఎస్సై క్రాంతి కిరణ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ఉన్నందువలన మంగళగిరి రూరల్ ప్రాంతాలలో 144 సెక్షన్ పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉన్నందువలన గ్రామాలలో, షాపుల వద్దా బహిరంగ ప్రదేశాలలో గుమ్మి కూడటం మరియు విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా కాల్చడం, పూర్తిగా నిషేధించడం అయిందని తెలిపారు. గ్రామ ప్రజలందరూ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ వారికి సహకరించవలసిందిగా రూరల్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రూరల్ ప్రాంతాలలో అన్ని షాపులకు, నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పెట్రోల్ బంకులవారు బాటిల్స్ లో, లూజ్ పెట్రోల్ అమ్మవద్దని నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కౌంటింగ్ ముగిసే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొడవలు ఘర్షణలకు తావు లేకుండా ఉండాలని అలా లేని పక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రూరల్ ఎస్సై హెచ్చరించారు. ఎలక్షన్ రోజు ప్రశాంత వాతావరణంలో ఎలక్షన్ జరిగిందని, అలాగే కౌంటింగ్ రోజు కూడా ప్రశాంత వాతావరణంలో జరగాలని రూరల్ ఎస్సై క్రాంతి కిరణ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్, ఫలితాల విడుదల సందర్భంలో హింసాత్మక సంఘటనలకు పాల్పడితే కఠినంగా కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు. ఆదివారం ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రంలోని పాలమల్ల యపాలెం గ్రామంలో ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. ప్రత్తిపాడు మండలం లో 144 సెక్షన్ మరియు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నట్లు, అప్పటి వరకు ఎటువంటి సమావేశాలు, ర్యాలీలు నిర్వహిం చుటకు అనుమతి లేదని రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకొని గ్రామాలలో ప్రతి ఒక్కరు సంయమనం పాటించి, పోలీసు వారికి సహకరించాలి అని కోరరు. ఏమి చేసినా పోలీసు వారికి వెంటనే తెలిసి పోతుందని, కేసుల్లో ఇరుకుంటే జీవితాలు అన్యాయంగా నాశనం అవుతాయని అన్నారు.



అభయ వీరాంజనేయస్వామి దేవస్థానంలో అన్నదానం

ప్రజాశక్తి-గుంటూరు :కొత్తపేటలోని పోతురాజువారి చౌక్ వద్ద ఉన్న శ్రీ అభయ వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జన్మదిన మహెూత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో అన్నదానం చేపట్టిన ఆలయ కమిటీని ఆయన అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, కార్పొరేటర్ పోతు రాజు సమత, ఆలయ ధర్మకర్తలు డాక్టర్ పోతురాజు శ్రీనివాస రావు, పోతురాజు రామ కృష్ణ, కిషోర్ బాబు, తోట రంగా రావు పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభిస్తున్న తులసి ధర్మచరణ్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఎమ్. మహతి

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి-వినుకొండ

మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్,వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎమ్. మహతి న్యాయవాదులతో కలిసి ఆదివారం మండలంలోని జాలలపాలెం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కెఎస్ఎమ్ వి.నాయుడు అధ్యక్షత వహించారు. న్యాయమూర్తి మహతి మాట్లా డుతూ (సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్) ఘన పదార్థాల వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. పొడి, తడి వ్యర్థాల గురించి అవగాహన కల్పించారు. ఒంటిళ్లు, గార్డెన్ నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు, మిగిలిపోయిన ఆహారాన్ని మొత్తం తడి వ్యర్థాలుగాను, ప్లాస్టిక్, పేపర్ వ్యర్థాల్ని పొడి వ్యర్థాలు గాను, గడువు ముగిసిన మందులు ఉపయోగించిన పెయింట్, డ్రమ్స్, బ్యాట రీలు, సిరంజిలు, మరియు గాజు వస్తువులు, సానిటరీ వేస్టు ఇంట్లోనే ప్రమాదక రమైన వ్యర్థాలను ఎలా వేరు వేరుగ విభజించాలో వివరించారు. అలాగే, ప్లాస్టిక్ బాటిల్స్ ను ఎలా రీసైక్లింగ్ చేయాలో కూడా వివరించారు. వ్యర్థాలను వేరు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇలా చేయడం వలన పరిసరాల పరిశుభ్రతతో పాటు తక్కువ కాలుష్యం, పర్యా వరణ అనుకూలమైందిగా ఉంటుందని చెప్పారు.న్యాయ వాదులు లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలో వివరిస్తూ దానికి కావలసిన అర్హతలు గురించి తెలిపారు. ఎవరికైనా న్యాయ సహాయం అవసరమైతే కోర్టు లోని లోక్ అదాలత్‌లో సంప్రదిం చాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ పఠాన్ గౌస్ మొహిద్దీన్ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ గాలి నాగరాజు, వి అమర్ బాబు, బి రామ్మోహన్ రావు,నలబోలు సోమశేఖర్, ఎం. చంటి, కె.రమేష్ బాబు, టి .పుష్ప కుమార్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాదాసు భాను ప్రసాద్

ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక ఎపిఎస్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజా మ్యాని ఫెస్టో కమిటీ కన్వీనర్ మాదాసు భాను ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొద్ది పాటి వర్షానికే బస్టాండ్ ప్రాంగణం జలమయం అవుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. దక్షిణ భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని ఛార్జీలు మన రాష్ట్రంలో వసూళ్లు చేస్తున్నా రని, ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో. మాత్రం ఘోరంగా విఫలమౌతున్నారని అన్నారు. బస్టాండ్ ప్రాంగ ణంలో మురుగునీటి పారుదల సౌకర్యాన్ని కల్పించి, పారిశుధ్యం మెరుగుపరచాలని, తిష్ట వేసిన అన్ని సమస్యలను పరి ష్కరించాలని డిమాండ్ చేశారు.

అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి

- రైతులూ..దళారులను నమ్మి మోసపోవద్దు
- విడిగా అమ్మే విత్తనాలను కొనుగోలు చేయొద్దు
- కొన్న విత్తనాలకు బిల్లులు తప్పనిసరి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ. మురళి



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

లైసెన్స్ కలిగిన అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ. మురళి సూచించారు. ఈ మేరకు జిల్లాలో విత్తన ఎరువుల దుకాణాలలో వ్యవసాయ శాఖ అధికారులతో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు ఆరంభం కానున్న నేపథ్యంలో రైతులు విత్తనాల కొను గోలుకు సంబంధించి, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సంద ర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన విత్త నాలకు తప్పని సరిగా బిల్లులు తీసు కోవాలని, బిల్లులు, విత్తన సంచులు పంట కాలం ముగిసే వరకు జాగ్రత్తగా ఉం చాలని రైతులకు సూచించారు. ఎవ రైనా దళా రులు గ్రామాల్లో ఇళ్ల వద్ద విత్త నాలు నిల్వ చేసి విక్రయిస్తే ఆయా మం డల పరిధిలోని వ్యవసాయ అధికారికి లేదా పోలీస్ వారికి సమాచారం అందిం చాలని కోరారు. గుడ్డ సంచులలో అమ్మే విత్తనాల ను, లూజుగా అమ్మే విత్త నాలను కొనుగోలు చేయ వద్దని తెలిపారు. పత్తి విత్త నాలు అన్ని బిజీ టు విత్తనాలు మాత్ర మేనని అన్ని ఒకే రకమైన సామ ర్థ్యం కలిగి ఉంటా యని, ఒకే రకమైన విత్తనం కోసం ప్రయత్నించవద్దని కోరారు. రైతులు కనీసం 60 మిల్లీ మీటర్లవర్షపాతం నమోదు కాకుండా పత్తి విత్తనాలు విత్త రాదని, అలా విత్తితే సకాలంలో వర్షం రాకపోతే మొలక శాతం తగ్గు తుందన్నారు. విత్తన వ్యాపారులందరూ చట్టానికి లోబడి వ్యాపారం చేయాలని చెప్పారు. రైతులకు ఇచ్చే బిల్లుపై వారి పూర్తి వివరాలు తప్పని సరిగా నమోదు చేయాలని, లాట్ నంబ ర్లను సరి చూడా లని, రైతు వారీగా విత్తన విక్రయాలను రికార్డులలో పొందుపరచాలన్నారు. అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు రికార్డులు అందు బాటులో ఉంచాలన్నారు. ప్రతిరోజూ విత్త నాలు అమ్మిన రిపోర్టును సమర్పించాలని, రికార్డులు తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని, స్టాక్ బోర్డు ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. డీలర్లు అధిక ధరలకు అమ్ముతున్నట్లు సమాచారం వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు.



విత్తన దుకాణాలలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్ ఫోటో)

ఆందోళనలో మిర్చి రైతులు

- 5 ఏళ్లుగా మిర్చి రైతులను వేధిస్తున్న నష్టాలు..
- తామర పురుగు, బొబ్బర తెగుళ్లతో అల్లాడుతున్న వైనం
- పురుగు మందులు పిచికారి చేసినా కానరాని ఫలితం
- పెట్టుబడులు తిరిగిరాని పరిస్థితి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సరైన వర్షాలు లేక ఒక ఏడాది, బొబ్బర తెగులుతో మరో ఏడాది, తామర పురుగుతో, ప్రకతి వైపరీత్యాలతో, నకిలీ విత్తనాలు పురుగు మందులతో మరో ఏడాది ఇలా ప్రతి ఏడాది మిర్చి రైతులు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి, చివరకు పెట్టిన పెట్టుబడులు రాక తీవ్ర నష్టాల పాలవుతున్నారు. ఏ ఏడాదికేయేడు రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు. ప్రతి ఏటా ఏదో ఒక ఆశతో రైతు వ్యవసాయం చేస్తూ అప్పుల పాలవుతూనే ఉన్నాడు. చివరకు ఆ అప్పులు తీర్చే మార్గం లేక ప్రభుత్వ ప్రోత్సాహం దక్కక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గత సంవత్సరం కూడా మిర్చి రైతులు ఈ ప్రాంతంలో అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. అయినా ప్రభుత్వం మాత్రం ఎలాంటి సాయం చేయ కుండా రిక్త హస్తాలం చూపించింది. గత ఏడాది అధిక వర్షాలతో ఖరీఫ్ లో సాగు చేసిన అపరాలు పంటలైన మినుము, పెసర దెబ్బతినగా ఆ పొలాలను దున్ని, కొంత మంది మిర్చి సాగు చేశారు. అయినా మిర్చికి ఇప్పుడు తామరపురుగు, బొబ్బర సోకటంతో ఏమీ చేయలేని పరిస్థితుల్లో రైతాంగం ఉన్నారు. ప్రభుత్వం కూడా నీటి పారుదల, వర్షాధారం అనేటువంటి సాకులు చూపి బీమా పథకానికి రైతులను దూరం చేస్తోంది. పంటలు సక్రమంగా పండక, ప్రభుత్వ సాయం లేక రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. తమను ఆదుకునే నాథుడు ఎవరూ లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కౌలు రైతు సంఘం నాయకులు నరసరావు పేట, రొంపిచర్ల మండలాలలోని పలు గ్రామాల్లోని మిర్చి పొలాలను క్షేత్ర స్థాయిలోపరిశీలించారు. తామర పురుగు, పూత, పిందె రాలిపోతూ ఆకులు ముడత పడి ఎదుగుదల లేకుండా పొలాలు ఉన్నాయి. కొంతమంది రైతులు నిరాశ చెంది మిర్చి పైర్లు పీకి మొక్కజొన్న సాగు చేసుకుంటుండగా కొంతమంది మిర్చిపై ఆశతో వేలాది రూపాయలు ఖర్చుపెట్టి పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం కనపడలేదని కొంత మంది రైతులు చెబుతున్నారు. ఏది ఏమైనా బొబ్బర తెగులు విపరీతంగా సోకి మిర్చి పొలాలు మొత్తం పూర్తిగా నష్టపోయాయి. తెగుళ్ల కారణంగా పైరు ఎదగకుండా వరుస నష్టాలతో మిర్చి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నారు.



గత ఏడాది నరసరావుపేట మండలంలో దెబ్బ తిన్న మిర్చి పొలాలను పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు (ఫైల్ ఫోటో)

సాగునీరు లేక తీవ్రంగా నష్టపోయా

ఈదర జనార్ధన్,మిర్చి రైతు అన్నవరం, రొంపిచర్ల మండలం

గతంలో కర్ణాటకలో వ్యవసాయం చేశా. మొక్కజొన్న మిర్చి పంటలు సాగు చేపట్టా. కొంత మేర లాభాలు అర్జించా. కొన్నేళ్ల క్రితం స్వగ్రామం వచ్చి 6 ఎకరాల భూమిలో బోర్లు వేయించి మిర్చి సాగు చేపడితే ప్రతి ఏటా నష్టాలే వస్తున్నాయి. గత ఏడాది కూడా 6 ఎకరాలు మిర్చి సాగు చేపట్టి తీవ్రంగా నష్టపోయా. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో బోర్ల నుండి నీరు రాకపోవడంతో పంటను కాపాడుకునేందుకు 2 కిలోమీటర్ల మేర ఓగేరు వాగు నుండి పొలంలోకి భూమిలో గుండా పైపులు వేసేందుకు రూ 1.50 లక్షలు వెచ్చించా. బొబ్బర తెగులు, తామర పురుగు సోకి తీవ్రంగా నష్టపోయా. ఈ ఏడాది మిర్చి సాగు విస్తీర్ణం తగ్గిస్తున్నా. మిగిలిన భూమిలో మొక్కజొన్న, అపరాలు సాగు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నా.

ప్రభుత్వం ఆదుకోకుంటే సాగు కష్టమే

కోండ్రు పిచ్చారావు, కౌలు రైతు కుంకలగుంట, నకరికల్లు మండలం

కొన్నేళ్ల నుండి మిర్చి పైరు సాగు చేస్తున్నాను. ప్రతి ఏటా ఏదో ఒక రూపంలో నష్టం వస్తోంది. ఈ ఏడాది 8 ఎకరాలలో ముందస్తు కౌలు ఎకరాకు రూ 30 వేలు చెల్లించి మిర్చి సాగు చేశా. సొంత ట్రాక్టర్, సొంత ఎద్దులు ఉన్నప్పటికీ సాగు ఖర్చులు ఎకరాకు రూ 2.50 చొప్పున పెట్టుబడి పెట్టా. గత ఏడాది మిచౌన్గ్ తుఫాను నేపథ్యంలో 5 ఎకరాల్లో మిర్చి పైరు పూర్తిగా దెబ్బతింది. మరో 3 ఎకరాలకు బొబ్బర తెగులు, తామర పురుగు సోకింది. ఈ పరిస్థితుల్లో పెట్టుబడులు రాక అప్పులు మిగిలాయి. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నాను. కౌలురైతులు వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొంది.



మిర్చి పంటలు పరిశీలించిన నరసరావుపేట సిపిఎం కార్యాయంలో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య (ఫైల్ ఫోటో)



చెత్త, ఇసుక, వ్యర్థాలతో పూడిపోయిన తుంగభద్ర మురుగు కాలువ



మురుగుకు ఆటంకంగా ఉన్న డ్రైన్ లోని గుర్రపు డెక్క

తుంగభద్ర డ్రెయిన్ అభివృద్ధికి వీడని గ్రహణం

ఆలూరు నుంచి మాచవరం దాకా నిలిచిపోయిన పనులు

ప్రజాశక్తి - పొన్నూరు

తుంగభద్ర మురుగు కాలువ అభివృద్ధి పనులకు గ్రహణం పట్టింది. రాజకీయ లబ్ధి పొందాలనే మిషతో డ్రెయిన్‌కు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించ లేదని రైతులు విమర్శిస్తున్నారు. డెల్టాలో పంట పొలాలు వరద ముంపుకు గురికాకుండా పూర్తిస్థాయిలో చేపట్టిన తుంగభద్ర మురుగు కాలువ ఆధునీకరణ పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయి. ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలు సంభవించినప్పుడు పొలాల్లో వరద నీరు నిలబడకుండా డ్రైన్లలో మురుగునీరు ప్రవహించేలా ఆధునీకరణ పనులు చేపట్టేందుకు 2011లో అప్పటి ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులు కేటాయించింది.సీపేజీ, డేడ్జింగ్ పనులు, కొల్లిమర్ల, ఈస్ట్ తుంగభద్ర, తుంగభద్ర మురుగు కాలువల అభివృద్ధికి ప్యాకేజీల వారీగా నిధులు మంజూరు చేసింది. డ్రైన్ల వెడల్పు , కల్వర్టుల నిర్మాణం, ఇన్లెట్లు, క్యాటిల్ రాంపులు, వంతెనల నిర్మాణంతో పాటు మట్టి పనులు చేసేందుకు ప్యాకేజీలకు నిధులు మంజూరు చేశారు. ఆధునీకరణ పనులు చేసేందుకు టెండర్లు కోట్ చేసిన కంపెనీల గుత్తేదారులు కొన్ని పనులకు ప్యాకేజీల వారీగా సబ్ లీజ్ దారులకు పనులు అప్పగించారు. వారి వద్ద నుంచి గుత్తేదారులు కమిషన్ కింద 10 శాతం మించి తీసుకున్నారు. దీనివల్ల మురుగు కాలువల అభివృద్ధి ఆధునీకరణ పనులు ముందుకు సాగలేదు. సబ్ కాంట్రాక్టర్లు ప్రాధాన్యత రంగాల పనులు విస్మరించి తమకు లాభాలు కలిసి వచ్చే పనులు మాత్రమే చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సబ్‌లీజ్‌దార్లకు సరైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ లేకపోవడం కూడా మురుగు కాలువల అభివృద్ధి పనులు నత్తనడకన జరగటం మరో కారణమని చెబుతున్నారు. పొన్నూరు పరిసర ప్రాంతాలలో పంట, మురుగు కాలువలకు ఇరువైపులా మూడు దశాబ్దాలుగా 30 సంవత్సరాల క్రితం నుంచి పక్కా కట్టడాలు నిర్మించి నివాసం ఉంటున్నారు. ఈ కారణం చెబుతూ గుత్తేదారులు ఆలూరు నుంచి మాచవరం రైల్వే బ్రిడ్జి వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం పనులు ఆపివేశారు. దీంతో ఈ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మురుగునీరు పారుదల ఆగిపోయి, ఇసుక మేటలతో డ్రైన్ పూడిపోయింది. గుర్రపు డెక్క తూటి కాడ తో బాగా పెరిగిపోయింది. డ్రైన్ లో కుళ్ళిన కళేబరాలు, వ్యర్థాలు చెత్త పడేస్తున్నారు డ్రైన్ లోనే చెత్త, కళేబరాలను వేసి తగుల పెడుతున్నారు. దీంతో ఇటువైపు వెళ్ళాలంటే దుర్గంధంతో ముక్కు పుటాలు బద్దలవుతున్నాయి. గుత్తేదారులు పనులు చేపట్టడంలో జాప్యం చేస్తూ ఎప్పటికప్పుడు పనులు చేసేందుకు ఉన్నతాధికారుల నుంచి బి ఓ టి అనుమతులు తెచ్చుకుంటున్నారు. తుంగభద్ర డ్రైన్ పై ఆలూరు వద్ద నిర్మాణం చేపట్టాలని డ్రాయింగ్ స్కెచ్ లు పూర్తి చేశారు. ఇప్పటివరకు టెక్నికల్ శాంక్షన్ రాలేదు. సిమౌత్ వద్ద 0 నుండి 5.75 కిలోమీటర్ల వరకు డ్రెజ్జింగ్ పనులకు అప్పట్లో రూ.18 కోట్లు నిధులు విడుదల చేశారు. కానీ ఇప్పటివరకు పనులు జాడే లేదు. 2024 లో కొత్తగా ఏర్పడే ప్రభుత్వ పాలకులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని రైతుల ప్రయోజనాలను దష్టిలో పెట్టుకుని ఎన్నో సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న తుంగభద్ర ములుగు కాలువ అభివద్ధి పనులు చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.



అసంపూర్తిగా డ్రెడ్జింగ్ పనులు



జిజిహెచ్‌లో సూపరింటెండెంట్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి లోని వివిధ వార్డులను ఆదివారం సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆకస్మిక తనిఖీలు చేశారు. తొలుత సర్జికల్ ఐసియును సందర్శించారు. సర్జరీ పోస్టు ఆపరేటివ్ వార్డు తనిఖీ చేశారు. సూపరింటెండెంట్ స్వయముగా చేసిన క్లిష్టమయిన ఆపరేషన్ రోగులను పర్యవేక్షించారు. అక్కడ వున్న రోగులందరిని పలకరించి వైద్యం జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి 333 వార్డును పరిశీలించారు. అనంతరం నాట్కో కేన్సర్ విభాగం లో సర్జరీ విభాగంలో ఉన్న రోగులను సందర్శించి వారితో మాట్లాడి వైద్యంలో ఏవైనా లోటు పాట్లుంటే తన దృష్టికి తీసుకుని రావాలని ఆయన ఆదేశించారు. కొన్నిరూములకు వేసిన తాళాలు నర్సుల వద్ద లేకపోవడం తో ప్రైవేటు సిబ్బంది వద్ద వుండటాన్ని గమనించి అసహనం వ్యక్తం చేశారు. దగ్గు ఆయాసం తో ఉన్నరోగికి సత్వరమే కళ్ళెపరీక్ష, టిబి పరీక్ష చేయమని పిజి విద్యార్థులను ఆదేశించారు. రోగికి పెట్ స్కాన్ 15 వేలకు చేయించాటాన్ని ఆయన తప్పుపట్టారు. పెట్ స్కాన్ మరింత తక్కువకు 12 వేలకు చేయటానికి పంపించే వారమని ఆయన అన్నారు. ఇలాంటి విషయాల్లో తన దష్టికి తెలిసి ఉంటే 12 వేలకు చేయమని పరిపాలన విభాగం నుంచి పంపించే వారమని ఆయన తెలిపారు. ఇకనుంచి తనకు తెలియచేయాలని ఆయన ఆదేశించారు. సూపరింటెండెంట్ వెంట వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

శిశుమరణాల తగ్గింపునకు కృషి

నవ జాత శిశువు ల మరణాలను తగ్గించేందుకు పిడియాట్రిక్ విభాగం ప్రత్యేక కృషి చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. ఆదివారం పిడియాట్రిక్ వార్డులో నవ జాత శిశువు ల సంరక్షణ.. వ్యాధుల నివారణ పై వర్క్ షాపు జరిగింది. ఈ వర్క్ షాపు లో గుంటూరు, ఒంగోలు, కాటూరి మెడికల్ కళాశాల మొదటి సంవత్సర పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ శిశువుల్లో వచ్చే జబ్బులను గుర్తించి వెంటనే వైద్య సేవలు అందించాలని ఆయన తెలిపారు. దానివల్ల శిశువుల మరణాలను తగ్గించడానికి అవకాశం కలుగుతుందన్నారు. శిశువు ల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. శిశువుల మరణాలను ఏవిధంగా తగ్గించాలన్న విషయం పై వర్కుషాపు లో ఇస్తున్న సలహాలు, సూచనలు కొత్తగా వచ్చిన పీజీ వైద్య విద్యార్థులకు ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. పిడియాట్రిక్ విభాగం హెచ్ ఓ డి డాక్టర్ దేవా కుమార్, డాక్టర్ ఏలిజాబత్, డాక్టర్ రమేష్ లు పాల్గొన్నారు.

ఆర్థిక రంగంలో మహిళల భాగస్వామ్యం అవసరం

మహిళా పారిశ్రామిక వేత్తల సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎపి ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ ఛాంబర్స్) ఆదివారం గుంటూరులో సెంట్రల్ జోన్ మహిళా పారిశ్రామికవేత్తల వింగ్ సమావేశం జరిగింది. సమావేశాన్ని విజ్ఞాన సంస్థల అధినేత లావు రత్తయ్య ప్రారంభించారు. వివిధ జిల్లాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలతో గుంటూరులో సెంట్రల్ జోన్ మహిళా పారిశ్రామికవేత్తల విభాగాన్ని ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాసరరావు మాట్లాడుతూ సుస్థిర ఆర్థికాభివృద్ధికి, లింగ సమానత్వానికి, పేదరిక నిర్మూలనకు ఆర్థికరంగంలో మహిళల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ప్రస్తుతం భారతదేశంలో మహిళల ఆర్థిక సహకారం జిడిపి 17 శాతం మాత్రమే ఉందని ఇది ప్రపంచ సగటు కంటే సగం కంటే తక్కువ అన్నారు. వర్క్‌ఫోర్స్‌లో 50శాతం మంది మహిళలను చేర్చడం ద్వారా భారతదేశం జిడిపి వద్ధిని 1.5 శాతం పెంచుతుందని ప్రపంచ బ్యాంక్ నివేదించిందన్నారు. సెంట్రల్ జోన్ మహిళా పారిశ్రామికవేత్తల విభాగం ఛైర్‌పర్సన్‌గా సక్కు మాధవి లత, వైస్ ఛైర్‌పర్సన్‌గా డాక్టర్ రాయపాటి మమత బాధ్యతలు స్వీకరించారు. ఛాంబర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ రఘురామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్, మహిళా పారిశ్రామికవేత్తల విభాగం ఛైర్ పర్సన్ వై.గీత శ్రీకాంత్ పాల్గొన్నారు.





కరాటేలో బ్లాక్ బెల్ట్ విజేతలు

ప్రజాశక్తి -పొన్నూరు

పొన్నూరు పట్టణం షరాఫ్ బజార్‌లో ఉన్న వై ఎన్ ఆర్ కరాటే డోజో పాఠశాలలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ లో పలువురు విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ ను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ చీఫ్ టెక్నికల్ డైరెక్టర్ యర్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు. బ్లాక్ బెల్ట్ సాధించిన షేక్ సోహెల్, షేక్ మొహమ్మద్ ఆదిల్, బొద్దులూరి మహేష్,షేక్ సాజిద్ హా సన్,అకరంశెట్టి పూర్ణేష్ వెంకట్,తొండెపు లక్ష్మీ లిఖిత సాయి. సెకండ్ డాన్ సాధించిన దేవి రెడ్డి సాయి సంతోష్ , తొండెపు లోకేష్ సాయి, పఠాన్ సంధాని. ఇంక మోక్ష యజ్ఞ శ్రీరామ్ చరణ్, షేక్ మొహమ్మద్ సోయబ్ గ్రీన్ బెల్ట్ ను పొందారు. కొండెపు గంగోత్రి, తవ్వ మారుతి రిషిక్, తుమ్మల రేవంత్ సాయి ఆరెంజ్ బెల్టును పొందారు. ఈ కార్యక్రమంలో పలు పూర్వ విద్యార్థులు పీపుల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ గూడవల్లి గంగాధర్, వరప్రసాద్, ఫారుక్ పాల్గొన్నారు. రాయల్ ఎలక్ట్రికల్స్ అండ్ హెూమ్ నీడ్స్ అధినేత షేక్ మహబూబ్ అలీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులను అభినందనలు తెలిపారు.



చల్లని 'మినరల్ వాటర్' చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి హాస్పటల్ రోడ్డులో మహేష్ క్లినిక్ వద్ద స్థానిక ఉమా యాదవ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ తాడిబోయిన మహేష్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్పటల్ రోడ్డులో నిత్యం ప్రజలతోపాటు దేవాలయానికి వచ్చే యాత్రికులతో రద్దీగా ఉంటుందని, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎండ తీవ్రతను బట్టి మజ్జిగను కూడా పంపిణీ చేస్తామన్నారు. భవిష్యత్తులో తమ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పాఠశాల దశలోనే పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - తెనాలి

పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథాలయాధికారిణి కె రమాదేవి అన్నారు స్థానిక నెహ్రు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో గత నెల 15న ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. అలాగే కథలు చెప్పటం, క్యారమ్స్, చెస్ వంటి పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 7న శిక్షణ ముగుస్తుందని, అదే రోజున వివిధ పోటీలలో విజేతలకు బహుమతి ప్రధానం ఉంటుందన్నారు. వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థులను ఆమె అభినందించారు.



ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బందికి నియామ ఉత్తర్వుల ప్రక్రియ పరిశీలిస్తున్న కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు

కౌంటింగ్ సిబ్బందికి నియామక ఉత్తర్వులు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు నియమించిన కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రెండవ విడత శిక్షణ కోసం ఆదివారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, తాడికొండ నియోజకవర్గ కౌంటింగ్ పరిశీలకులు డాక్టర్ మహాబీర్‌ప్రసాద్, పొన్నూరు నియోజకవర్గ కౌంటింగ్ పరిశీలకులు అక్షయసూద్, గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కౌంటింగ్ పరిశీలకులు ఎస్.పి.కార్తీకా, మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి, తెనాలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రఖార్ జైన్‌తో కలసి ఎన్ఐసీ పోర్టల్ ద్వారా రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి ఉత్తర్వులను జనరేట్ చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఈవియం, పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేసిన 267 టెబుల్స్‌కు అవసరమైన కౌంటింగ్ సూపర్ వైజర్లు , కౌంటింగ్ అసిస్టెంట్లు , మైక్రో అబ్జర్వర్లు రిజర్వుతో కలిపి మొత్తం 1041 మంది ఉద్యోగులకు శిక్షణ ఉత్తర్వులను జనరేట్ చేశారు. ఈవియం ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు చేసే కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు జూన్ 3వ తేది ఉదయం 9 గంటల నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లోని హాల్స్ లో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కౌంటింగ్‌పై రెండవ విడత శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పెద్ది రోజా, తాడికొండ ఆర్ఓ గంగరాజు, పొన్నూరు ఆర్ఓ లక్ష్మీకుమారి, గుంటూరు పశ్చిమ ఆర్ఓ కె. రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేటి పాలీసెట్ కౌన్సెలింగ్ వాయిదా

ప్రజాశక్తి-గుంటూరు : పాలిటెక్నిక్ కాలేజిల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో భాగంగా చివరి రోజైన సోమవారం నిర్వహించాల్సిన ధ్రువపత్రాల పరిశీలన 6వ తేదీకి వాయిదా పడింది. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో షెడ్యూల్‌లో మార్పు చేసిన విషయం విదితమే. తొలుత ప్రకటించిన షెడ్యూలు ప్రకారం 3వ తేదీతో ధ్రువపత్రాల పరిశీలన ముగుస్తుంది. కానీ కౌంటింగ్ వల్ల విద్యార్థులు అసౌక ర్యానికి గురి కాకూడదనే ఉద్దేశంతో వాయిదా వేశారు. దీంతో 108001 నుండి చివరి ర్యాంకు వరకు ఉన్న విద్యార్థులు 6వ తేదీన హాజరు కావాల్సి ఉంటుంది. ఆ మేరకు వెబ్ ఆప్షన్లు, ఆప్షన్లలో మార్పుల షెడ్యూల్‌లోనూ మార్పులు చేశారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తి అయిన తర్వాత 7 నుండి 10వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుంది. అలాగే 11న ఆప్షన్లలో మార్పులు చేసుకోవటానికి అవకాశం కల్పించారు. 13వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుంది. 14-19 తేదీల్లో విద్యార్థులు కాలేజిల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. కాగా ఆదివారం నిర్వహించిన కౌన్సె లింగ్‌లో భాగంగా 92001 నుండి 108000 ర్యాంకులకు ధ్రువపత్రాల పరిశీలన చేయగా నల్లపాడు లోని ఎంబిటిఎస్ పాలిటెక్నిక్ కాలేజిలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో 219 మంది విద్యార్థులు హాజరయ్యారు.



విద్యార్థినులను అభినందిస్తున్న అతిథులు, ప్రిన్సిపాల్ తదితరులు

మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజిలో ఆదివారం జాబ్ అచీవర్స్‌డే నిర్వహించారు. 2023-24 విద్యా సంవత్సరంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా ఉద్యోగాలు పొందిన వివిధ బ్రాంచిల విద్యార్థినులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో వెలస్పన్ కార్పొరేషన్ లిమిటెడ్ టిసిఒఇ హెడ్ పొన్నగంటి శ్రీనివాసరావు, తెనాలి మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ తోటా రాఘవరావు, చార్టర్డ్ అకౌంటెంట్ చుండూరు రాగలత, వామని ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ఆర్ మేనేజర్ పసుపులేటి రంజిత్‌కుమార్, కళాశాల ఆల్మనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ.ఉషాకుమారి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు మాట్లాడుతూ ఇసిఇ, సిసిపి, ఫార్మసీ, జిటి బ్రాంచిల విద్యార్థులు 80 మంది ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. అత్యధికంగా ఫార్మసీ విద్యార్థిని బోయిన వాసంతి, సిసిపి విద్యార్థిని ఇ.హర్షిత, జిటి విద్యార్థిని ఎస్.భవాని రూ.1.80 లక్షలు, ఇసి విద్యార్థిని షేక్.అజిబున్ రూ.3 లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా అతిథులు ఆయా విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో ఆయా బ్రాంచిల హెచ్ఒడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి

ర్యాండమైజేషన్ ద్వారా టేబుల్స్ కేటాయింపు - అభ్యర్థులు, ఏజెంట్లతో పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్, ఎస్‌పి మలికా గర్గ్ సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, వేదికపైన జిల్లా ఎస్‌పి తదితరులు



ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రానికి వచ్చే ఆయా పార్టీల అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లు 4వ తేదీ తెల్లవారు జామున 6 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని పల్నాడు ఎస్పీ శ్రీ కేష్ బి లత్కర్, ఎస్పీ మల్లికా గర్గ్ ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అన్నీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో మంగళవారం సార్వత్రిక ఎన్నికలు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో బాగంగా తీసుకున్న చర్యలు కౌంటింగ్ కేంద్రాలలో అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు పాటించాల్సిన అంశాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలోనికి ఎలాంటి ఎలెక్ట్రానిక్స్ పరికరాలు, సెల్ ఫోన్స్‌కు అనుమతి లేదన్నారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు కేటాయించిన పార్కింగ్‌లోనే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్ సమక్షంలో స్ట్రాంగ్ రూమ్స్ ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. ఓట్లు లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడానికి రాజకీయ పార్టీలు అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లు సహ కరించాలన్నారు. అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి ఓట్లు లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. ఇప్పటికే కౌంటింగ్ సంబంధించి సూపర్వైజర్లు అసిస్టెంట్ సూపర్వైజర్లకు మొదటి విడత శిక్షణ ఇవ్వడం జరిగిందని, కౌంటింగ్ సిబ్బందికి సంబంధించి రెండో విడత రాండమైజేషన్ ద్వారా నియోజ కవర్గాలకు కేటాయించడం జరిగిందని, 4న ఉదయం 5 గంటలకు టేబుల్స్‌కు కౌంటింగ్ సిబ్బంది టేబుల్ ర్యాండమేజేషన్ ద్వారా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. 4న ఉదయం 6 గంటల కల్లా అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లు ఐడి కార్డుతో పాటుగా ఫారం 18 తప్పని సరిగా తీసుకొస్తేనే మెయిన్ గేట్ వద్ద అనుమతించ బడుతుందన్నారు. కౌంటింగ్ పరిశీలకులు రిటర్నింగ్ అధికారులు ఏఆర్వోలు కంప్యూటర్స్ ఆపరేటర్స్ మాత్రమే సెల్ ఫోన్స్ కౌంటింగ్ కేంద్రంలో అనుమతి ఉందని తెలిపారు. అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లు సమక్షంలో స్ట్రాంగ్ రూములను 4న ఉదయం 6 గంటలకు ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ద్వారా అందజేసిన అథారిటీ లెటర్స్ కలిగిన మీడియా ప్రతినిధులు మాత్రమే మీడియా సెంటర్ లోనికి కెమెరాలు సెల్ ఫోన్స్ తెచ్చుకోవచ్చునని, మీడియా ప్రతినిధులు మీడియా కేంద్రంలోనే ఉండా లన్నారు. మీడియా ప్రతినిధులు ఎవ్వరు కూడా కౌంటింగ్ కేంద్రాల్లోనికి అనుమతి లేదని, సమాచార శాఖ అధికారులు, సిబ్బంది ఫొటోస్, వీడియోస్, రౌండ్ల వారీగా ఫలితాలను తీసుకొచ్చి మీడియా సెంటర్లో మీడియా ప్రతినిధులకు అందజేయడం జరుగు తుందన్నారు. ఎస్పీ మల్లికా గర్గ్ మాట్లాడుతూ జిల్లాలో అల్లర్లు గొడవలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా భద్రత చర్యలు చేపట్టామన్నారు. హింసాత్మక సంఘటనలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డిఆర్ఓ, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, రాజకీయ ప్రతినిధులు, కౌంటింగ్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు



ఈ నెల 4 న జరగనున్న సాధారణ ఎన్నికల కౌంటింగ్‌నకు అవసరమైన సిబ్బందిని 2వ రాండమైజేషన్ ద్వారా ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ ఆదివారం ఆయా నియోజకవర్గాలకు కేటాయించారు. ఇందుకు గానూ 283 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లను , 353 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను, 328 మంది మైక్రో అబ్జెర్వర్లను కలిపి మొత్తం 964 మందిని రాండమైజేషన్ ద్వారా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ కేటాయించారు. ఈ కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు, డి.ఆర్.ఓ , ఆర్.ఓ లు, డి.ఐ.ఓ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లన్నీ పూర్తి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాతో జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జెసి

రేపు జరగనున్న సార్వత్రిక ఓట్ల లెక్కింపునకు పూర్తి సన్నద్ధంగా ఉన్నామని కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ వెలగపూడి ఏపి సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆదివారం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు, ఎన్నికల సంబంధిత సమస్యలు, ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు, ఖచ్చితమైన ఫలితాలను త్వరితగతిన ప్రకటించేందుకు జిల్లాల వారీగా చేస్తున్న ముందస్తు ఏర్పాట్లు, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మరియు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్ విసి హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ బి లత్కర్ మాట్లాడుతూ రానున్న మంగళవారం ఓట్ల లెక్కింపునకు 100 శాతం పూర్తిగా సన్నద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ నరసరావుపేట మండలంలోని కాకాని జె.ఎన్.టి.యు కళాశాలలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ నియోజక వర్గానికి, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అత్యంత పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, సిసి కెమెరాల ఏర్పాటు చేపట్టామన్నారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత చేపట్టాల్సిన కార్యకలాపాలపై అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. సజావుగా కౌంటింగ్ ప్రక్రియను చేపట్టేందుకు అన్ని విధాల సంసిద్ధంగా ఉన్నామని, అన్ని రకాల ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్ ప్రకారం నడుచుకోవాలని రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు పలు పర్యాయాలు సమావేశాలు పెట్టి వారికి కౌంటింగ్ అంశాలు వివరించామని, అభ్యర్థులు, ఏజెంట్లకు ఐడి కార్డులు, వాహనాల పాసులు గురించి తెలియజేశామన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్, ఈటిపిబిఎస్/పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు, ఈవీఎంలలో ఫోల్డ్ అయిన ఓట్ల లెక్కింపునకు అవసరమైన శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, రౌండ్ల వారిగా ఫలితాల ట్యాబులేషన్ మరియు ఎన్కోర్‌లో ఫీడ్ చేయడం, అందుకు అవసరమైన ఐటీ సిస్టంల ఏర్పాటు, ఓట్ల లెక్కింపు పూర్తయిన తదుపరి ఈవీఎంలను సీల్ చేసే విధానంపై అవగాహన, స్టేట్యూటరీ నివేదిక, రౌండ్ వైస్ నివేదికలు పంపించేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు, ఈ నెల 8వ తేదీ లోపు నివేదించాల్సిన ఇండెక్స్ కార్డు రూపొందించే విధానం మరియు మూడు అంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు తదితర అంశాలపై జిల్లాల వారీగా జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. విసిలో జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.